రంగమ్మ-చిన్న బిడ్డ పెళ్ళి చేసింది.

బాగానే చేసింది- అనుకున్నారంతా-

గిట్టనివాళ్ళు ఏదో అనుకున్నా-అది మనకు అప్రస్తుతం.

చిన్న బిడ్డ పెళ్ళికి పెద్దబిడ్డ మొగుడు మాత్రం రాలేదు.

పెళ్ళి కుదరగానే-ర్యాలీ సైకిలు కొనిస్తేగాని- రానని కబురు చేశాట్ట-

రంగమ్మ కిమ్మనలేదు.

అయినా చెల్లెలు పెళ్ళికి అక్క-వచ్చింది. అదీ కండిషన్ మీద. అంటే ముహూర్తం తైంకుండి. మర్నాడు- భర్త దగ్గరికి చేరే షరతుపైన-

ఇంట్లోకొస్తున్న కూతుర్ని చూసి "అల్లుడేదే" అనడిగింది రంగమ్మ.

విసవిసా నడిచింది తప్ప సమాధానం చెప్పలేదు బిడ్డ.

దగ్గరికొచ్చిం తరువాత- భుజాల్నిపట్టుకొని- "బావున్నావా?" అంది సూటిగా కళ్ళలోకి చూసి.

అమ్మ రంగమ్మను కావలించుకుని-బావురుమంది పెద్దబిడ్డ.

"ఏమైనా కష్టపెడ్తున్నాడటే"- అనడిగింది ఆతృతగా రంగమ్మ.

తల అడ్డంగా ఊపింది- ఏడుస్తూనే.

"మరి" అంది.

మాటాడలేదు బిడ్డ- అమ్మ కౌగిలి వదలనూలేదు.

అయితే-కౌగిలిలో ఉన్నశరీరంలో ఏదో మార్పు కనిపించింది రంగమ్మకు.

"ఏమైనా విశేషమా?" అంది చెవిలో-బిడ్డతో.

విచిత్రమైన వెలుగు కనిపించింది బిడ్డ కళ్ళలో.

అమ్మ కౌగిలిలోనే గారాలు పోయింది ఏడుపు మాని.

"ఎన్నో నెలేంటి?"

మూడు వేళ్లు చూపించింది-

"ఇప్పుడంటే నాకు చెప్పేది?"

"ఆయనకు కూడా చెప్పలేదు" అంది గొణిగినట్టు.

"ఛీ. ఎర్రి మొఖమా! ఎట్టా బ్రతుకుతారే?" అని "లోనికెళ్ళి స్నానం చెయ్యి మొదట" అంటూ — పశువులశాలవైపు నడచింది.

"ఇగో" అన్న పిలుపు వినిపించి-ఆగింది రంగమ్మ.

ఆగి- పిలుపు వినిపించిన వైపు పారజూసింది?

వల్లబుర్రె- కాళ్ళ సందునున్న లేగను కట్టుమట్టుకు చేరుస్తూకనిపించాడు రంగయ్య. రంగయ్య అంటే మరెవరో కాదు రంగమ్మకు స్వయానా భర్త. తాళికట్టిన మగడు.

రంగమ్మకు పెళ్ళయిన కొత్తలో— రంగయ్య భార్యగానే నట్టింట్లో అడుగు పెట్టింది.

ఇద్దరాడపిల్లలు కల్గిం తరువాత — కుటుంబం వేరు పడటంతో- ఒడిదుడుకుల్ని సరిజేసుకొనే ప్రయత్నంలో. భర్త అసమర్థుడు- ఒక్క- పిల్లలు కనే కార్యక్రమానికి తప్ప- మరెందుకూ వ్యవహారికంగా పనికి రాడనే నిర్ణయానికొచ్చేటప్పటికి-రంగమ్మ గారి భర్తగా రంగయ్య దిగజారిపోయాడు.

ఆతరువాత ఓ మగనలుసు కలిగితే బాగా బ్రతుకుతెరువులో ఉపయోగపడతాడు.

ఆడపిల్ల ఎలాగూ ఇల్లువదలేసేవాళ్ళేనని-చాలా తాపత్రయపడిందిపాపం.

మగ సంతానం కోసం రంగయ్యను పోరింది.

లాభంలేదని అర్థమైం తరువాత బయట కూడా ప్రయత్నించింది. గుళ్ళూ గోపురాలకూ మ్రొక్కింది.

ప్రాణాధారాలు కూడా వదుకుంది చివరకు.

అయితే-ఈ ప్రాణాధారాలు చేసే రోజుల్లోనే-ఓ సాధు పుంగవుడు మగ సంతానం కల్గిస్తానని హామీ ఇవ్వడంతో-నమ్మి—దానా తిప్పలు పడి మరీ—ఆ సాధువు దగ్గరికెళ్ళింది రంగమ్మ.

మగసంతు కాదుకదా? అసలు సంతే కల్గలేదు.

ఆ ప్రయత్నంలోనే అయిదారు వసంతాలు గడిచిపోయాయి.

పదిమంది నడచిన బాట.....

రంగమ్మకు సంతానమూ అలాగే అయింది.

ఇంతలో పెద్దబిడ్డ- పెద్దదయి కర్తవ్యాన్ని గుర్తు చేసింది.

ఈ పెద్దపిల్లి ధ్యాస- శారీరకంగా విశ్రాంతిని దూరం చేసింది.

చాలా శ్రమించింది పాపం.

ఎట్టకేలకు- పెద్దబిడ్డ పెండ్లికి- ఏర్పాట్లు పూర్తి చేసింది.

'మమ'- అనిపించింది- ఓ శుభ ముహూర్తాన.

బిడ్డను-సాదరంగా అల్లుడింటికిపంపింది.

ఇప్పుడిదేమో తల్లి కాబోతోంది.

'సృష్టి వరవడి' అనుకుని ఆనందపడింది

'బావుంది' అనుకొని వెనక్కి తిరిగి. అడుగేసింది.

రంగయ్య కనిపించాడు.

"ఏంటి?"అంది.

"అన్ని ఏర్పాట్లూ పూర్తయినట్టేనా" అన్నాడు.

"ఆఁ!" అంటూ వల్లెవేస్తున్న చాకలాళ్ళ దగ్గరకు నడిచింది రంగమ్మ. రత్తిగాడు సున్నం కలుపుతూ. నీళ్ళు మోస్తున్న సుబ్బుల్ని ఆబగా చూడటం గమనించింది. ఒక్క-క్షణం ఆగి "సుబ్బి" అని కేకేసింది.

"అమ్మగారూ" అంటూ నీళ్ళబిందె గాబుకాడ దింపి వడుగున వచ్చింది.

"రత్తయ్యను పెళ్లాడతావేంటే?" అంది రంగమ్మ ఆప్యాయంగా చూస్తూ.

"గదేందమ్మగారూ! ఆడికేమో పెళ్ళయిందిగదా?" అంది సిగ్గువడుతూ.

"పెళ్ళయిన మగాడు పనికిరాడా ఏంటే? ఓసి నీ పిచ్చి దొంగద్దోల నీ! ఆడికిరెండో






పెళ్ళాంగా ఎల్లు. నీ కోసం అగ్రులు చాసి చస్తున్నాడు. నువ్వు ఇట్టపడ్డోడ్ని పెళ్ళి జేసుకునేకంటే- నిన్నిట్టపడేవోడ్ని చేసుకుంటేనే సుఖం" అంటూ గేటు దాకా నడిచింది.

సిగ్గుతో మొగ్గయి సుబ్బి బిందెత్తుకుని నూతివైపు పారిపోయింది.

పెళ్ళికూతురు మామగారు—బజాట్లో రిక్షా దిగుతూ కనిపించాడు.

ప్రక్కకు తొలిగి నిల్చుంది.

ఆదరబాదర గేటు దాటుతుండగా-"ఎక్కడ్నుంచి అన్నయ్యగారూ రావటం??" అని ముఖాన కొంచెం నవ్వు పులుముకొని ఆడిగింది.

అగి—రంగమ్మను చూసి "ఓ ఇక్కడే ఉన్నావా? నీ కోసమే వస్తున్నాను"అన్నాడు నిటారుగా నిల్చుని—

"ఇంట్లోకి పదండి మాటాడుకుందాం." అంది రంగమ్మ నడక ప్రారంభించి.

"అక్కర్లేదు" అన్నాడు వియ్యంకుడు ఖచ్చితంగా, నిల్చున్న చోటునుంచి కదలకుండా.

రంగమ్మ కూడా అక్కడే ఆగి:"అయితే చెప్పండి" అంది.

"పెళ్ళిముహూర్తంఇంకామూడు రోజులే గదా ఉంది" అన్నాడు కసిగా.తల ఊపింది అవునన్నట్లుగా రంగమ్మ.

"వారంముందు కట్నం మొత్తం కావాలి అన్నాం కదా?"

"అవును"-

"రాలేదు. ఎందుకో తెల్సుకోవద్దా?" అన్నాడు కోపంగా.

"అందలేదు" అంది తేలికగా.

"-ఎప్పుడందుతుంది?"

"పెళ్ళిలోనే పళ్ళెంలో పోస్తాం. అనుమానించక తరలిరండి" అంది.

"కుదరదు"— అన్నాడు ఖచ్చితంగా.

"మీ యిష్టం" అంది- ఇంటివైపుకు అడుగులేస్తూ.

వియ్యంకుడికి- ఎంత మంట పుడుతున్నా- ఆమె వెంట నడవక తప్పలేదు.

గొడ్లచావిడికాడ రంగయ్య కనిపించి- వియ్యంకుడికి ఎదురొచ్చి- "ఎప్పుడొచ్చారు" అని పరామర్శించాడు!

రంగయ్యకు సమాధానం ఈయకుండా రంగమ్మ వెంట ఇంట్లోకి నడిచాడు.

రంగమ్మ కూర్చోమనకముందే రుసరుసలాడుతూ మంచంపై కూర్చున్నాడు.

లోనికెళ్ళి- మంచినీళ్ళు పట్టుకొచ్చి- వియ్యంకుడి కిచ్చింది రంగమ్మ.

"అక్కర్లేదు" అన్నాడు.

"ఇదిగో! ఎల్లుండి మీ రెట్లాగూ తరలి వస్తారు. పెళ్ళి జరుగుతుంది. అనక- కొత్త దంపతుల్ని తీసుకొని ఎట్లాగూ మీ ఇంటి కెడతారు. ఇవేవీ ఆగేవికావుగానీ- మంచి నీళ్ళయితే త్రాగండి" అంది.

మాటాడక- నీళ్ళ చెంబందుకుని గటగటా త్రాగేశాడు.

చెంబు క్రిందపెట్టి- "డబ్బు" అన్నాడు.

ఈసారి నవ్వింది రంగమ్మ.

ఆ నవ్వు చూసిం తరువాత- వెన్నుపూసలో చలి మొదలయింది వియ్యంకుడికి.

"పెళ్ళి కాగానే పసుపు బట్టలతోనే ఇద్దరిన్నీ తిరుపతి పంపాలి. మొక్కుందని" అంది.

అ యో మ యం గా చూసి "డబ్బు" అన్నాడు తిరిగి జీరగా.

"అమ్మాయితో పాటు వస్తుంది. ఏం ఫరవాలేదు. మీకు తెలుసు. మా తమ్ముడు ఎ.ఎస్.పి. అని. కట్నం తక్కువయిన పైకం నాల్గువేలు కావాలంటే వాడే తెస్తానన్నాడు. అందుకే వాడికోసమే ఎదురు చూస్తూంట."

వెంటనే లేచాడు.

వెనక్కిచూడకుండా— వెళ్ళిపోయాడు.

మొలక నవ్వు నవ్వుతుంది రంగమ్మ 'డబ్బు' అని కసిగా అనుకుని-

చిన్నబిడ్డ పెళ్ళి చేసింది రంగమ్మ.

"బాగానే చేసింది పాపం" అనుకున్నారంతా.